క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరులో విద్యుత్ పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని దర్శి డీఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

13న విద్యుత్ సమస్యలపై అదాలత్

కురిచేడు: విద్యుత్ అదాలత్, వినియోగదారుల అవగాహన సదస్సు ఈ నెల 13న పొదిలిలో నిర్వహించనున్నట్లు ఏడీఈ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల గ్రీవెన్స్ రీ డ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు, ఒంగోలు ఆపరేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, దర్శి ఈఈ శ్రీనివాసులు, ఇతర విద్యుత్ అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని దర్శి విద్యుత్ డివిజన్ పరిధిలోని పొదిలి, దర్శి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు తదితర మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయన సూచించారు. సర్వీస్ కనెక్షన్ సెంటర్ పూర్తి అడ్రసు, సెల్ నెంబరుతో అర్జీ సమర్పించి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

తాళ్లూరు: మండల కేంద్రం తాళ్లూరు ఏబీసీ ఉన్నత పాఠశాలలో ఒంగోలు జిమ్స్ వైద్యురాలు పూజిత మాదాల ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్ తెలిపారు. తాళ్లూరు ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వీర జవాన్‌కు గిరిజన సంఘాల నివాళి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

యర్రగొండపాలెం: భారత్-పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు శనివారం గిరిజన సంఘాలు నివాళులర్పించాయి. జాతీయ జెండాలు, వీర జవాన్ చిత్రపటాన్ని చేతబూని పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మురళీ నాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మురళీ నాయక్ అమర్‌రహే, అమరుడా నీకు వందనం, నీ త్యాగాన్ని తాము మరువలేమని, యావత్ భారత దేశం నీ కుటుంబానికి అండగా ఉంటుందని గిరిజన నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఎంసీహెచ్ మంత్రూ నాయక్, ఆర్.ఆరుణాబాయి, కె.సేవా నాయక్, ఎం.నాగేశ్వర నాయక్, ఆర్.బాలునాయక్, ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, డి.బాలు నాయక్, ఆర్.ఏసా నాయక్, రామారావు నాయక్ పాల్గొన్నారు.

సామాన్యులపై గ్యాస్ గుదిబండ

- సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంపు
- ఆందోళనలో ప్రజలు
- పట్టించుకోని ప్రభుత్వాలు



సిలిండర్‌ను డెలివరీ ఇస్తున్న బాయ్

పుల్లలచెరువు: గ్యాస్ బండ సామాన్య కుటుంబాలకు గుదిబండగా మారుతోంది. పెట్రోల్, డీజిల్ తరహాలోనే గ్యాస్ ధర పెరుగుతూనే ఉంది. ఇటీవల ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచింది. రాష్ట్రంలో పేద ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. విద్యుత్ బిల్లులకు తోడు గ్యాస్ ధరలు పెరగడం సామాన్యులకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం సామాన్య మానవుడు నిత్యం వాడే వంట గ్యాస్ ధరలు వీపరీతంగా పెరిగి గుదిబండగా మారింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్యాస్ ధరలు కూడా పెరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరమవుతోంది. ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలకు పేద, మధ్య తరగతి ప్రజల్లో సంతోషం కరువైంది. దీంతో ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శాపనార్థాలు పెడుతున్నారు. కేంద్రం ప్రభుత్వం గ్రామాల్లో దీనదయాళ్ పథకం, ఉజ్వల, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికి గ్యాస్‌ను అందించాలని లక్ష్యంతో గ్రామాల్లోని ప్రతి ఒంటికి గ్యాస్ సరఫరా చేసింది. సిలిండర్ ధర పెరుగుతూ ఉండటం సామాన్యులకు కష్టంగా మారింది. గ్యాస్ పెంపు ధరలతో తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. సిలిండర్ ధర ఎంత పెరుగుతుందో అర్థం కాని స్థితిలో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతో సామాన్యుడి జేబుకు చిల్లు పడుతోంది. తాజాగా ఒక్కసారిగా రూ.50 పెంచడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో గ్యాస్ ధర పెంపు వినియోగదారులను ఆందోళన కలిగిస్తోంది.

అదనపు భారం



వై.పాలెం నియోజకవర్గంలోని దోర్నాల, పెద్దారవీడు, పుల్లలచెరువు, వై.పాలెం, త్రిపురాంతకం మండలాల్లో దాదాపు దాదాపు లక్ష గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. లక్షల రూపాయలు ప్రతి నెలా అదనపు భారం పడుతోంది. ఇది పేదలకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వాలు దీనిపై ఆలోచన చేయాలి

– ఎల్.రాములు, మండల ఉపాధ్యక్షుడు, పుల్లలచెరువు

ధరలు ఉపసంహరించుకోవాలి



పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలి. పేదలపై పెనుభారం మోపే విధానాలు ప్రభుత్వాలు మానుకోవాలి. గ్యాస్ ధరలు తగ్గించకుంటే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయంపై తగు చర్యలు తీసుకోవాలి.

– రమణమ్మ, గృహిణి, పుల్లలచెరువు



ఇండ్లచెరువులో నేలకొరిగిన వేపచెట్టు

గాలీవాన బీభత్సం

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గాలి బీభత్సం సృష్టించింది. ఇండ్లచెరువులో 3 విద్యుత్ స్తంభాలు, పెద్ద పెద్ద రేకుల షెడ్లు గాలికి నేలకూలాయి. గ్రామానికి చెందిన మూడమంచు మూగయ్య నూతనంగా నిర్మించిన రేకుల షెడ్ గాలికి లేచి ఎగిరి పడ్డాయి. ఎబ్బిలి ఏగమ్మ ఇంటి రేకులు నేలకొరిగాయి. రోశయ్య ఇంటిపై వేసిన రేకులు లేచిపోయాయి. బజారులో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గ్రామ ప్రజలకు అంతరాయం జరిగింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న విద్యుత్ ఏఈ తమ సిబ్బందితో వచ్చి విద్యుత్ లైన్ తప్పించారు.



దొనకొండలో కురుస్తున్న వర్షం

నిరుపేదల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- డీపీఓ జీవీ నాయుడు



దర్శి: కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ జీవీ నాయుడు

దర్శి (కురిచేడు): పీ4 సర్వేలో గుర్తించిన నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలను డీపీఓ జీవీ నాయుడు వివరించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆయన శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా విజన్ 2.0 కు సంబంధించి 10 ప్రశ్నలు, సమాధానాలు రాబట్టారు. అవసరమైన చర్యల గురించి క్లుప్తంగా వివరించారు. సుధాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, రిసోర్స్‌పర్సన్లు, ఎంసీఓ పాల్గొన్నారు.

తాళ్లూరు: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు తాగు నీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడు ఆదేశించారు. మండలంలోని తూర్పుగంగవరం, రామభద్రాపురం, నాగంబొట్లపాలెం, బొద్దికూరపాడు, లక్కవరం, దోసకాయలపాడు, బెల్లంకొండవారిపాలెం, తాళ్లూరు, శివరామపురం, కొర్రపాటివారిపాలెం చెత్త సంపద కేంద్రాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలు నిరుపయోగంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాళ్లూరులో దోర్నపు వాగు ఒడ్డున చెత్త అంతా పెద్ద కుప్పగా వేసి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. నీరు కలుషితంతో పాటు పూడిక పేరుకుపోయే ప్రమాదం ఉందని, తక్షణం తొలగించాలని ఎంపీడీఓ దారా హనుమంతురావును డీపీఓ ఆదేశించారు. చెత్త సంపద కేంద్రాల ప్రధాన్యం ఏమిటి? మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే చెత్తను తొలగించాలని ఆదేశించారు. క్లాప్ మిత్రలు ఎంత మంది ఉన్నారు? పన్నుల వసూళ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి 250 కుటుంబాలకు క్లాప్ మిత్రలను నియమించనున్నట్లు చెప్పారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు క్లీనింగ్ చేసి బ్లీచింగ్ తగిన మోతాదులో చల్లి ట్యాంక్‌లను శుభ్రం చేయించాలన్నారు.



తాళ్లూరు: చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

మరమ్మతులకు నోచుకోని జనరేటర్



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

పెద్దారవీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఏర్పాటు చేసిన జనరేటర్ మరమ్మతులకు గురై మూలన పడింది. జనరేటర్‌కు కనీస సంరక్షణ చర్యలు లేకపోవడంతో ఆరుబయట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎలాంటి రక్షణ లేకుండా నిరుపయోగంగా ఉంది. మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జనరేటర్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో అధికారులు వదిలేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ వినియోగం బాగా పెరగడంతో విద్యుత్ అవసరం పెరిగింది. విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయానికి జనరేటర్‌ను ఏర్పాటు చేసింది. విద్యుత్ కోత సమయంలో రెవెన్యూ కార్యాలయంలో ప్రజల పనులకు అంతరాయం కలగకుండా గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణ జనరేటర్ నిర్వహణకు నిధులు లేక దాన్ని పక్కన పడేశారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేని సమయంలో కార్యాలయంలోని కంప్యూటర్ పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ధనం వృథా అవుతోందని కార్యాలయానికి వచ్చే మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జనరేటర్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాప్టిస్ట్ సంఘాల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న బాప్టిస్ట్ ఫీల్డ్ సంఘ అధ్యక్షుడు సజీవరాజు

యర్రగొండపాలెం: బాప్టిస్ట్ సంఘాల సువార్త పరిచర్య సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సజీవరాజు అన్నారు. శనివారం త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో జరిగిన ఆ సంఘ 112వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆ సంఘ పరిధిలో ఉన్న 6 మండలాల నుంచి దాదాపు 500 మంది సువార్తికులు, పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీటీసీ నాయకులు ఎనిబెరి నాగరాజు మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీ ఆస్తుల పరిరక్షణ కోసం తామందరం కలిసి పోరాడాలని ఆయన పిలుపు ఇచ్చారు. కరస్పాండింగ్ సెక్రటరీ వై.ఏవిలిన్ కుమార్, గౌరవ సలహాదారుడు బేతం జాన్, జాషువా డానియేల్, జీవన్ ప్రశాంత్ పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు



తిరుమలనాథ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కోసం దంపతులు గిరికొండ చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో మొక్కుబడులు ఉన్న మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో మహాసంప్రోక్షణ

- 12 ఏళ్ల తర్వాత శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి నగర్‌లో ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలలో నిర్వహించారు. స్వామి నిజరూప పాద స్పర్శదర్శనాన్ని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి స్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఉటుకూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏరువ దేవిరెడ్డి, డీవీఆర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అర్చకులు అంగరవెంకట కనక నరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో స్వవిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా అంతర్జాతీయ తల్లుల దినోత్సవం



తల్లుల ఆశీస్సులు అందుకుంటున్న చిన్నారులు

యర్రగొండపాలెం: మండలంలోని కొత్తగోళ్లవిడిపిలో ముందస్తు అంతర్జాతీయ తల్లుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లులకు చిన్నారులు పాదాభివందనాలు చేసి వారి నుంచి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పూజల మూర్తెమ్మ పాల్గొన్నారు.

అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళి



పెద్దదోర్నాల: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఆల్ ఇండియా బంజారా సేవ నాయకులు



పుల్లలచెరువు: మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

పుల్లలచెరువు: పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరులో అమరుడైన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు వీరుడా వందనం..అంటూ పుల్లలచెరువులో యువత ఘనంగా నివాళులర్పించారు. శనివారం పుల్లలచెరువు బస్‌స్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. మాజీ సైనికుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నీ త్యాగం మరువలేం, నీ పోరాటం వృథాకానివ్వం.. నాయక్ సలాం..అంటూ విషన్న వదనంతో సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, మండల ఉపాధ్యక్షుడు రాములు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు హనుమంతురావు, బాల, సుబ్బారావు, గురునాథం, ఇదెమ్మ, మల్లికార్జునరావు, డిష్ చిన్నా, ప్రసాద్, కృష్ణమూర్తి పాల్గొని మురళీనాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

బంజారా సేవా ఆధ్వర్యంలో..

పెద్దదోర్నాల: దేశం కోసం ప్రాణాలర్పించి వీర మరణం పొందిన మురళీనాయక్ మృతికి నివాళులర్పిస్తూ ఆల్ ఇండియా బంజారా సేవా ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యుద్ధ వీరుడు మురళీనాయక్.. అంటూ కొనియాడారు. మురళీనాయక్‌కు జోహార్లు అర్పిస్తూ మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్ నుంచి పలు వీధుల మీదగా భారత్ మాతాకీ జై, మురళీనాయక్ అమర్‌రహే.. అంటూ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆల్ ఇండియా బంజారా సేవా నాయకులు లాలూనాయక్, బాలూనాయక్, గాలేనాయక్, జయచంద్రనాయక్, అంబానాయక్, బుగ్గానాయక్, మల్లికార్జుననాయక్, రాంబాబునాయక్, తులసీనాయక్, మహంతు నాయక్, కాంతారావునాయక్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సింగా బూషి పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త వెంకటరెడ్డిని శనివారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. త్రిపురాంతకం మండలం దువ్వలి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కుడికాలికి తీవ్ర గాయమైంది. ఈ సంఘటన అనంతరం ఆయన వైద్యం చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, పార్టీ నాయకుడు మురారి గాలయ్య యాదవ్ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



కపురం శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న తహసీల్దార్, డీటీ

దర్శి (కురిచేడు): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దర్శి ఏరియాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున అనేక కార్యక్రమాలు నిర్వహించటం గర్వకారణంగా ఉందన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల గౌరవాధ్యక్షుడిగా రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను ప్రజలకు అందించడంపై సంతృప్తి కలిగిందన్నారు. కపురం శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. డీటీ వెంకట్, ఆర్ఐ శ్రీనివాసులు, రామకృష్ణ, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.